RNI NO.TELTEL/2022/83842

# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 271 | సంపుటి 4 | మంగళవారం | 30-06-2026 | పేజీలు 4 | వెల 3/-



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతుభరోసా పథకం కింద పెట్టుబడి సాయం పంపిణీకి రంగం సిద్ధమైంది. మంగళవారం నుంచి అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో రైతుభరోసా నిధులు జమ చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. తొలి విడతలో 2 ఎకరాల వరకు సాగుభూమి కలిగిన 41.37 లక్షల మంది రైతులకు రూ.2,482 కోట్లను విడుదల చేయనున్నట్లు తెలిపారు. మిగిలిన రైతులకు కూడా దశలవారీగా నిధులు జమ చేసి, మొత్తం 10 రోజుల్లో అర్హులందరికీ పెట్టుబడి సాయం అందజేస్తామని వెల్లడించారు. వర్షా ల కారణంగా ఖమ్మం జిల్లా మధిరలో నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభను రద్దు చేసి, దానికి బదులుగా హైదరాబాద్ లోని శిల్పకళా వేదికలో రైతుభరోసా పంపిణీ సదస్సు నిర్వహించి నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

# నేటి నుంచి 'రైతు భరోసా'

- 2 ఎకరాల వరకు రైతులకు నేటి నుంచే నిధుల జమ
- తొలి విడతలో 41.37 లక్షల మంది రైతులకు లబ్ధి
- రూ.2,482 కోట్ల రైతుభరోసా నిధుల విడుదల
- 10 రోజుల్లో అర్హులందరికీ పెట్టుబడి సాయం
- వర్షాల కారణంగా మధిర సభ రద్దు..
- శిల్పకళా వేదికలో సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభం
- దశలవారీగా రైతుల ఖాతాల్లో రైతుభరోసా
- రైతులకు పెట్టుబడి సాయంపై ప్రభుత్వం శ్రీకారం

**ప్రభాత గమనం, హైదరాబాద్:**

రాష్ట్రంలోని అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించే 'రైతుభరోసా' నిధుల విడుదలపై ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. మంగళవారం నుంచి రైతుల ఖాతాల్లో నేరుగా నిధుల జమ ప్రక్రియ ప్రారంభం కానుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్క రైతుకూ దశలవారీగా పెట్టుబడి సాయాన్ని అందిస్తామని, మొత్తంగా 10 రోజుల్లో ఈ ప్రక్రియ అంతా పూర్తవుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు.

**తొలి విడతలో 2 ఎకరాల లోపు వారికి..**

రైతుభరోసా నిధుల పంపిణీలో భాగంగా తొలి విడతలో 2 ఎకరాల వరకు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు నిధులు విడుదల చేయనున్నారు. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 41.37 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ. 2,482 కోట్లను విడుదల చేయనుంది. మిగతా రైతులకు సైతం రాబోయే 10 రోజుల్లో దశలవారీగా ఖాతాల్లో నగదు జమ అవుతుందని మంత్రి తెలిపారు. అలాగే కొత్తగా పాసుబుక్‌లు పొందిన రైతులు జులై 5వ తేదీ లోపు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి తుమ్మల సూచించారు.

**వర్షాల వల్ల మారిన వేదిక: శిల్పకళా వేదికలో కార్యక్రమం**

రైతుభరోసా నిధుల విడుదల కోసం ఖమ్మం జిల్లా మధిరలో భారీ ఎత్తున 'రైతు ఆశీర్వద సభ', 'రైతు మేళా' నిర్వహించాలని ప్రభుత్వం తొలుత భావించింది. అయితే నిన్న ఖమ్మం జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా సభా ప్రాంగణం దెబ్బతినడంతో ఆ సభను ప్రభుత్వం రద్దు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మధిర సభకు ప్రత్యామ్నాయంగా హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో 'రైతు భరోసా పంపిణీ సదస్సు'ను నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ నిధుల విడుదల కార్యక్రమం ప్రారంభం కానుంది.

**మధిరలో ముగింపు సభ: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం ఈ నెల 4వ తేదీ వరకు వర్షాలు ఉన్నందునే మధిర సభ వేదికను హైదరాబాద్‌కు మార్చాల్సి వచ్చిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వివరించారు. ఖమ్మం జిల్లా మధిరలో కచ్చితంగా సభ నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. రైతుభరోసా ముగింపు వేడుకగా ఈ సభను భారీ ఎత్తున నిర్వహించే యోచనలో ఉన్నామని, వాతావరణం అనుకూలించిన వెంటనే కొత్త తేదీని ప్రకటిస్తామని డిప్యూటీ సీఎం వెల్లడించారు.




04

# 'సర్' ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి

- గడువులోగా ఎస్ఐఆర్ పూర్తి చేయాలి
- పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ
- ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల ధ్రువీకరణ
- ఫారాల పంపిణీ వేగవంతం చేయాలి
- ప్రతి అర్హుడిని ఓటరు జాబితాలో చేర్చాలి
- ఎస్ఐఆర్ పురోగతిపై సీఈవో సుదర్శన్ రెడ్డి సమీక్ష
- ఓటరు జాబితా సవరణపై అధికారులకు ఆదేశాలు

భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లకు ఆదేశించారు. ప్రతి అర్హుడైన ఓటరును జాబితాలో చేర్చేలా బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలను ధ్రువీకరించాలని, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ ను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.



3

# వరంగల్ కొత్త సీపీగా ఎన్. శ్వేత నియామకం

- సన్ ప్రీత్ సింగ్ కు సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ గా బదిలీ
- రాష్ట్రవ్యాప్తంగా ఐపీఎస్ అధికారుల భారీ బదిలీలు

రాష్ట్ర ప్రభుత్వం సోమవారం భారీ స్థాయిలో ఐపీఎస్ అధికారుల బదిలీలు చేపట్టింది. ఇందులో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ గా పనిచేస్తున్న సన్ ప్రీత్ సింగ్ ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ గా బదిలీ చేస్తూ, ఆయన స్థానంలో ప్రస్తుతం హైదరాబాద్ నార్త్ రేంజ్ జాయింట్ కమిషనర్ గా ఉన్న 2012 బ్యాచ్ ఐపీఎస్ అధికారి ఎన్. శ్వేతను వరంగల్ పోలీస్ కమిషనర్ గా నియమించింది. త్వరలోనే ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు.

# జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌గా టి. వెంకన్న బాధ్యతల స్వీకరణ

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) నూతన కమిషనర్ గా నియమితులైన టి. వెంకన్న సోమవారం ప్రధాన కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమై నగర పారిశుధ్యం, తాగునీటి సరఫరా, మౌలిక వసతులు, పెండింగ్ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించి, ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.



3




# డ్రగ్స్ రహిత జిల్లాగా ములుగు

- అందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్
- ములుగు జిల్లా లో డ్రగ్స్ అవగాహన ర్యాలీ

— వివరాలు 2వ పేజీలో

# నారాయణపురం రైతులకు రైతు భరోసా వర్తింపజేయాలి

- కొత్త పట్టాదారు పాస్ బుక్ లకూ రైతుభరోసా ఇవ్వాలని విజ్ఞప్తి
- వేం నరేందర్ రెడ్డి, పొంగులేటిని కలిసిన రైతులు
- నారాయణపురం రైతులకు ఈ విడతలోనే సాయం కోరుతూ వినతి
- పట్టాదారు పాస్ బుక్ ల ఆధారంగా సాయం అందించాలని డిమాండ్
- కొత్త పాస్ బుక్ లు పొందిన రైతులకు అవకాశం కల్పించాలని వినతి



తాజాగా జారీ అవుతున్న పట్టాదారు పాస్ పుస్తకాల ఆధారంగా కూడా రైతుభరోసా పథకం వర్తింపజేసి తమకు ఈ విడతలోనే పెట్టుబడి సాయం అందించాలని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామ రైతులు ప్రభుత్వాన్ని కోరారు. మాజీ ఎంపీటీసీ ధరావత్ రవి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా ములుగు

- అందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్
- ములుగు జిల్లా లో డ్రగ్స్ అవగాహన ర్యాలీ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా జిల్లా పోలీస్ శాఖ మరియు జిల్లా సంక్షేమ శాఖ సంయుక్తంగా నిర్వహించిన డ్రగ్స్ అవగాహన ర్యాలీలో ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి ప్రేమలత ముఖ్య అతిథిగా పాల్గొని, జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ములుగు జిల్లా కేంద్రంలోని బండారుపల్లి మూలమలుపు నుండి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో ప్రజలు, విద్యార్థులు, ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "డ్రగ్స్, గంజాయి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం" అంటూ స్లొగన్స్ చేస్తూ ర్యాలీ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును, కుటుంబాలను నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన ర్యాలీ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి కిషోర్ కుమార్ , ములుగు డి.ఎస్.పి రవీందర్ , పస్ర సిఐ దయాకర్ , ములుగు సీఐ సురేష్ , ఎస్సై లు, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు, విద్యార్థులు, యువత, సిబ్బంది పాల్గొన్నారు.





## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్ జూన్ 29(ప్రభాత గమనం):**

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి లో జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్ తొ కలిసి దరఖాస్తులను స్వీకరించారు .ఈ సందర్భంగా గూడూరు మండలం వెంగంపేట గ్రామానికి చెందిన కట్ల పార్వతి తాను ఉన్న ఇల్లు శిథిలావస్థకు చేరడంతో దానిని కూల్చివేసి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో రేకుల షెడ్ లో కిరాయికి ఉంటున్నామని అది ఈ మధ్య కురిసే వర్షాలకు శిథిలావస్థకు చేరుకోవడం జరిగిందని దయచేసి తమ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయగలరని కోరారు. మరిపెడ మండలం వీరారం తండ కు చెందిన డి.రమేష తనకున్న పట్టా భూమిలోని కొంత భూమి గుర్తు తెలియని వ్యక్తీ అక్రమంగా పట్టా చేయించుకున్నారని అట్టి పట్టాను రద్దు చేసి తనకు న్యాయం చేయాలని కోరారు. పెద్దవంగర మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన సుధగాని యాధలక్షి 2023–24 సం.లో గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేసి యం.బి రికార్డు అయిన బిల్లులను ఇప్పించగలరని కోరారు. సోమవారం నాడు నిర్వహించిన ప్రజావాణి లో వివిధ శాఖలకు సంబంధించి (205) దరఖాస్తులను సంబందిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారానికి పరిశీలించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో డి.ఆర్.ఓ నాగలక్షి , డిప్యుటీ కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు.



## జిల్లాలో పల్స్ పోలియో ఇంటింటి సర్వే విజయవంతం

**మహబూబాబాద్ జూన్ 29(ప్రభాత గమనం):**

మహబూబాబాద్ జిల్లాలో నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా రెండో రోజు ఇంటింటి సర్వే విజయవంతంగా కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 938 బృందాలు ఇంటింటికీ వెళ్లి 5 సంవత్సరాల లోపు చిన్నారులను గుర్తించి, పోలియో చుక్కలు వేయని పిల్లలకు టీకా అందించాయి. ఈ కార్యక్రమంలో మొత్తం 2,456 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రవి రాథోడ్ కంబాలపల్లి గ్రామంలో స్వయంగా ఇంటింటి సర్వేను పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్లి 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు అందాయా లేదా అని ధృవీకరించి, ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా పోలియో చుక్కలు వేయాలని ఫీల్డ్ సిబ్బందికి సూచించారు. దేశాన్ని పోలియో రహితంగా కొనసాగించాలంటే ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. శివకుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ ఎ. పురుషోత్తం, ఎంపీహెచ్ఈఓ కె.ఎల్.ఎన్. స్వామి, సబ్ యూనిట్ ఆఫీసర్ వి. శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ పి. లింగారెడ్డి, అనిల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని తల్లిదండ్రులు తమ 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించి, పోలియో రహిత భారతదేశ పరిరక్షణకు సహకరించాలని సూచించారు.



## అదనపు డీసీపీ రవికి ఘన వీడ్కోలు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో అడిషనల్ డీసీపీ (అడ్మిన్)గా సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందుతున్న అడిషనల్ డీసీపీ రవికి పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక కేయూసీ ప్రాంతంలోని వి.యం. కళ్యాణ వేదికలో పరిపాలన విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందుతున్న అధికారిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ, అడిషనల్ డీసీపీ రవి పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో బాధ్యతాయుతంగా పనిచేస్తూ తన సేవలతో ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. ముఖ్యంగా పోలీసు సిబ్బందికి సంబంధించిన శాఖాపరమైన సమస్యలపై వెంటనే స్పందించి, వాటి పరిష్కారం కోసం చొరవ చూపుతూ సిబ్బందికి సత్వర న్యాయం జరిగేలా కృషి చేశారని తెలిపారు. అప్పగించిన ప్రతి బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించడం ఆయన ప్రత్యేకత అని ప్రశంసించారు. పోలీస్ శాఖ అభివృద్ధికి, పరిపాలనా వ్యవస్థ బలోపేతానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొంటూ, పదవీ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో ఏఓ సంపత్ కుమార్, సూపరింటెండెంట్లు రమేష్, యాకుబ్ బాబా, సంధ్య, వహీద్, గిరి, పూజితతో పాటు సీపీ కార్యాలయ సిబ్బంది పాల్గొని అడిషనల్ డీసీపీ రవికి ఘనంగా వీడ్కోలు పలికి శుభాకాంక్షలు తెలిపారు.



## ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యం

- భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్
- జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజాదివాస్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 19 ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను ఓర్పుగా విన్నారు. ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులతో సమీక్షించి, తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, ఫిర్యాదులపై వెంటనే స్పందించి, త్వరితగతిన పరిష్కారం చూపేలా దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేదా మూడో వ్యక్తుల ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందేలా చర్యలు తీసుకుంటామని, ప్రజలకు మరింత చేరువగా ఉండి సమర్థవంతమైన పోలీస్ సేవలు అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సమన్వయంతో వాటిని త్వరితగతిన పరిష్కరిస్తున్నామని, ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

## నూతన కమిషనరేట్ భవన నిర్మాణానికి సన్నాహాలు..

- పాత భవనాల తొలగింపుపై పోలీస్ కమిషనర్ సమీక్ష

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో నూతన కమిషనరేట్ భవన నిర్మాణానికి సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సోమవారం సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. నూతన కమిషనరేట్ భవనం పరిసరాల్లో ఉన్న పాత భవనాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్, ప్రస్తుతం ఆ భవనాల్లో కొనసాగుతున్న వివిధ విభాగాల కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు తరలించాల్సి వస్తే వాటి కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశంపై అధికారులతో సవివరంగా చర్చించారు. ప్రజలకు అందుతున్న పోలీసు సేవలకు ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని, కార్యాలయాల తరలింపు ప్రక్రియను సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా పాత భవనాల తొలగింపు, నూతన భవన నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు, శాఖల మధ్య సమన్వయం, భద్రతా చర్యలపై కూడా అధికారులతో చర్చించి తగిన సూచనలు చేశారు. ఈ సమీక్షలో అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు సురేంద్ర, అంతయ్య, ఆర్ఐలు శ్రీధర్, సతీష్, స్పర్జన్ రాజ్, శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.




## నిర్ణీత గడువులోపు గణన ఫారాల పంపిణీ పూర్తి చేయాలి

- తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**మహబూబాబాద్ జూన్ 29(ప్రభాత గమనం):**




ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా గణన ఫారాల పంపిణీని నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుధర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుధర్శన్ రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా నుంచి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరిష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ...గణన ఫారాలను బూత్ స్థాయి అధికారులు మాత్రమే పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అనధికార వ్యక్తులతో గణన ఫారాలను పంపిణీ చేయకూడదని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు తప్పనిసరిగా ఇంటింటికి వెళ్లి గణన ఫారాలను పంపిణీ చేయాలని, ప్రతి అర్హత కలిగిన ఓటరు తన ఫారాన్ని తప్పనిసరిగా సమర్పించేలా అవగాహన కల్పించాలని సూచించారు. గణన ఫారాన్ని సమర్పించిన ఓటర్ల వివరాలు మాత్రమే ముసాయిదా ఓటరు జాబితాలో కొనసాగించబడతాయని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు నిర్ణీత గడువులోపు ఇంటింటికీ వెళ్లి గణన ఫారాల పంపిణీని పూర్తి చేయడంతో పాటు ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, ఆర్డీవోలు రాజేశ్వరి, గణేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్, బీజేపీ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్

- ఎంపీ చామల కిరణ్ కుమార్ రె
- కేటీఆర్, హరీశ్ రావుపై కాంగ్రెస్ ఎంపీ విమర్శలు

**హైదరాబాద్ జూన్ 29(ప్రభాత గమనం):**

హైదరాబాద్ గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్, బీజేపీలపై తీవ్ర విమర్శలు చేశారు.గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని ఆరోపించారు. కేటీఆర్, హరీశ్‌రావు ఇద్దరూ బిల్లా–రంగా లాంటివారేనని వ్యాఖ్యానించారు. సిరిసిల్ల, సిద్దిపేట నియోజకవర్గాల్లో బీజేపీకి వచ్చిన ఓట్లే ఇందుకు నిదర్శనమని అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో బీజేపీ ప్రేక్షకపాత్రకే పరిమితమైందని విమర్శించిన ఆయన, ప్రధాని మోదీ హామీ ఇచ్చిన రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు.



## రిజిస్ట్రేషన్ల జోరు...

- ప్రభుత్వానికి పెరిగిన ఆదాయం.. రోజుకు అదనంగా రూ.10 కోట్ల రాబడి...

**హైదరాబాద్ జూన్ 29(ప్రభాత గమనం):**

రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువలు పెంచినప్పటికీ రిజిస్ట్రేషన్ల సంఖ్యలో ఎలాంటి తగ్గుదల కనిపించలేదని తెలుస్తోంది. ఈ నెల 5 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త మార్కెట్ ధరలతో ప్రభుత్వానికి రోజుకు సుమారు రూ.10 కోట్ల అదనపు ఆదాయం లభిస్తోంది. ఈ నెల 25 నాటికి రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చిన ఆదాయం రూ.1,023.42 కోట్లకు చేరగా, నెలాఖరు నాటికి అది రూ.1,100 కోట్లకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది జూన్‌తో పోలిస్తే ఈసారి సుమారు రూ.200 కోట్ల మేర అదనపు ఆదాయం నమోదైనట్లు సమాచారం.



# పోలీసు శాఖలో భారీగా ప్రమోషన్లు

- 36 మంది సీఐలు డీఎస్పీలుగా పదోన్నతి

హైదరాబాద్ జూన్ 29(ప్రభాత గమనం):

తెలంగాణ పోలీసు శాఖలో భారీ ఎత్తున పదోన్నతులు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 36 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు (సీఐలు) డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) హోదాకు పదోన్నతి కల్పిస్తూ, వారికి పోస్టింగ్‌లు కూడా కేటాయిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, పోలీసు యూనిట్లలో కొత్త డీఎస్పీలు బాధ్యతలు చేపట్టనున్నారు. పదోన్నతి పొందిన అధికారులను తెలంగాణ డీజీపీ సివి ఆనంద్ అభినందించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, పదోన్నతి అనేది కేవలం హోదా పెరగడం మాత్రమే కాదని, దానితో పాటు బాధ్యతలు కూడా మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. నిజాయితీ, క్రమశిక్షణ, నిబద్ధతతో ప్రజలకు సేవ చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను పారదర్శకంగా, చట్టబద్ధంగా పరిష్కరించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, బాధితులకు సత్వర న్యాయం అందించే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీజీపీ ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రదర్శించాలని ఆయన పిలుపునిచ్చారు. పదోన్నతి పొందిన ఈ 36 మంది అధికారులు ప్రస్తుతం లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాల్లో కాకుండా పోలీసు శాఖలోని ఇతర విభాగాల్లో డీఎస్పీలుగా సేవలందించనున్నట్లు అధికారులు వెల్లడించారు.



# మహబూబాబాద్ లో ఉద్యోగ మేళా..

మహబూబాబాద్, జూన్ 29(ప్రభాత గమనం):

మెడ్‌ప్లస్ సంస్థ నందు హైదరాబాద్ పరిధిలో ఫార్మాసిస్ట్, ఫార్మసీ ఎయిడ్, జూనియర్ అసిస్టెంట్ ,సి.ఎస్.ఏ ,ఆడిట్ అసిస్టెంట్ గా పనిచేయుటకు 18 నుంచి 30 సంవత్సరాల స్త్రీ పురుషులు అర్హులన్నారు.అభ్యర్థులకు అవకాశాలు కల్పించుటకు వచ్చె నెల 1వ తారీఖున జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం మహబూబాబాద్ నందు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి టి. రజిత సోమవారం నాడు ఓ ప్రకటన లో తెలిపారు. అర్హత ఆసక్తి కల్గిన అభ్యర్డులు వచ్చె నెల1వ తారీఖున మహబూబాబాద్ జిల్లా ఎంప్లాయ్ మెంట్ కార్యాలయం, రూమ్ నెం. 25 , రెండవ అంతస్తు, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఎంప్లాయ్మెంట్ కార్యాలయంలో జరుగు జాబ్ మేళాకు విద్యార్హత సర్టిఫికేట్లతో వివరాలతో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఉపాధి అధికారి కోరారు .ఇతర వివరాలకు 9392310323 ని సంప్రదించగలరని ఈ సందర్భంగా అధికారి పేర్కొన్నారు.

## ఎరువులను అధిక ధరలకు

# విక్రయిస్తే చర్యలు తప్పవు

- మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకన్న
- విత్తనాల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

కేసముద్రం జూన్ 29(ప్రభాత గమనం):



ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవో వెంకన్న అన్నారు. సోమవారం కేసముద్రం మండలంలోని పలు ఎరువులు,విత్తనాల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఎరువుల నిల్వలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులు, ఇన్వాయిస్లు, పిఓఎస్ మిషన్ బ్యాలెన్స్, గోదాము బ్యాలెన్స్, స్టాక్ బోర్డులను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రతి ఎరువుల డీలర్ రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని, స్టాక్ రిజిస్టర్ నిల్వలు పిఓఎస్ నిల్వలు,గోడౌన్ బ్యాలెన్స్ నిల్వలు సమానంగా ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. ప్రతి డీలర్ ఎరువుల కంపెనీకి సంబంధించిన ఓ ఫామ్ లను ఎరువుల లైసెన్స్ లో పొందుపరచలన్నారు. అదేవిధంగా కొత్తగా గోదాములను తీసుకున్నట్లయితే అటువంటి గోదాములను ఎరువుల లైసెన్స్ లో తప్పకుండా నమోదు చేసుకోవాలని తెలిపారు.డీలర్లు కనీస మద్దతు ధరకు మాత్రమే ఎరువులను అమ్మాలని, ఎవరైనా డీలర్లు ఎరువులను అధిక ధరలకు విక్రయించినట్లైతే ఎరువుల నియంత్రణ చట్టం 1985, నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నారాయణపురం రైతులకు

# రైతు భరోసా వర్తింపజేయాలి

- తాజాగా జారీ అవుతున్న పట్టాదారు పాస్ పుస్తకాలకు అవకాశం కల్పించాలి
- రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, మంత్రి పొంగులేటిని కలిసిన రైతులు

కేసముద్రం, జూన్ 29(ప్రభాత గమనం):



కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో తాజాగా జారీ అవుతున్న పట్టాదారు పాస్ పుస్తకాలకు రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయాలని ఆ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ధరావత్ రవి ఆధ్వర్యంలో రైతులు హైదరాబాద్‌లో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలను వేర్వేరుగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ...గత ఎనిమిదేళ్లుగా తమ గ్రామంలో పట్టాదారు పాస్ పుస్తకాలు లేకపోవడంతో గత ప్రభుత్వ హయాంలో అమలైన రైతుబంధు పథకం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోని రైతు భరోసా పథకం కింద మొత్తం 16 విడతల ఆర్థిక సాయం తమకు అందలేదని తెలిపారు. అంతేకాకుండా పట్టాదారు పాస్ పుస్తకాలు లేకపోవడం వల్ల రైతు బీమా పథకం కూడా వర్తించక, ఈ కాలంలో మృతి చెందిన పలువురు రైతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చొరవతో గ్రామంలోని రైతులందరికీ పట్టాదారు పాస్ పుస్తకాల జారీ ప్రక్రియ దాదాపు పూర్తయిందని పేర్కొన్నారు. అయితే రైతు భరోసా పథకానికి ఈ నెల 15వ తేదీలోపు పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన వారికే అవకాశం కల్పించారని, తమ గ్రామ రైతులకు కూడా ఈ విడతలోనే రైతు భరోసా నిధులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై రాజ్యసభ సభ్యుడు, మంత్రి సానుకూలంగా స్పందించినట్లు రైతులు తెలిపారు. గ్రామంలో తాజాగా జారీ అయిన పట్టాదారు పాస్ పుస్తకాలను త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రైతులకు అందజేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు తెలిపారని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు జాటోత్ వెంకన్న, గుగులోత్ లచ్చు, వీరా సింగ్, వీరన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్పీకి భద్రత కల్పించాలి

- పద్మశ్రీ మందకృష్ణ మాదిగ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌కు తక్షణమే పటిష్ట భద్రత కల్పించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోమవారం బహిరంగ లేఖ రాశారు. లేఖలో ఆయన మాట్లాడుతూ, గత మూడు దశాబ్దాలుగా సామాజిక న్యాయం, ఎస్సీ వర్గీకరణ, దళితుల హక్కుల సాధన కోసం డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ నిరంతరం పోరాడుతున్నారని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో ఆయనపై జరుగుతున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో ఆయన ప్రాణాలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ప్రభుత్వం పూర్తి భద్రత కల్పించాలని కోరారు. డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌కు ఏదైనా అపాయం జరిగిన పక్షంలో దానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని మందకృష్ణ మాదిగ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తరపున గొంతెత్తే నాయకుల భద్రతను పరిరక్షించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అందించిన సహకారం ఎంతో కీలకమని, ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి ఆయన ఎల్లప్పుడూ అండగా నిలిచారని మందకృష్ణ మాదిగ గుర్తు చేశారు. ఎలాంటి రాజకీయ విభేదాలు ఉన్నా ప్రజా నాయకుల భద్రత విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించరాదని సూచించారు. అదేవిధంగా ఎస్సీ వర్గీకరణ అమలు, దళితుల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం అంశాల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కూడా ముఖ్యమంత్రిని ఆయన కోరారు. ఈ బహిరంగ లేఖ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- పోలీస్-ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే శాంతిభద్రతల పరిరక్షణ
- నూతన సర్పంచులను సన్మానించిన ఇన్ స్పెక్టర్ ఏ.మహేందర్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



గ్రామాల్లో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమని హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ పేర్కొన్నారు. ఇటీవల ఎన్నికైన హసన్‌పర్తి మండల నూతన సర్పంచులు హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌ను మర్యాదపూర్వకంగా సందర్శించిన సందర్భంగా వారికి పోలీస్ శాఖ తరఫున ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధితో పాటు ప్రజల భద్రతకు కూడా సర్పంచులు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి గ్రామంలో నేరాలను ముందుగానే అరికట్టేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా సీసీటీవీ కెమెరాలు గ్రామ భద్రతకు కళ్లుగా పనిచేస్తాయని, చోరీలు, దాడులు, గొడవలు, ఇతర నేరాలను నివారించడంలో వాటి పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ప్రతి గ్రామంలోని ప్రధాన కూడళ్లు, గ్రామ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్ ప్రాంతాలు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సర్పంచులకు సూచించారు. సీసీటీవీల ఏర్పాటు వల్ల నేరాలను అరికట్టడంతో పాటు నేరాలకు పాల్పడిన వారిని వేగంగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం సులభతరం అవుతుందని వివరించారు. అదేవిధంగా గ్రామాల్లో జూదం, బెల్ట్ షాపులు, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, ఇతర అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించేందుకు పోలీస్ శాఖతో సమన్వయంగా పనిచేయాలని కోరారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు బానిస కాకుండా గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లోకి వచ్చే అనుమానాస్పద వ్యక్తులు, గుర్తు తెలియని వాహనాలు లేదా అనుమానాస్పద సంఘటనలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రజల సహకారం ఉంటే నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. పోలీస్ శాఖ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, శాంతియుత సమాజ నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, పోలీసులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి మండల నూతన సర్పంచులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు


# త్వరితగతిన పరిష్కరించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- కలెక్టరేట్ లో ఫిర్యాదుల స్వీకరణ

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద స్వయంగా పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను వినతిపత్రాల రూపంలో కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముఖ్యమైన వేదిక అని పేర్కొన్నారు. ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్ చేసి, సమగ్రంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం సహించబోమని స్పష్టం చేశారు. ఈ వారపు ప్రజావాణిలో మొత్తం 249 దరఖాస్తులు అందాయి. అందులో రెవెన్యూ శాఖకు 82, మున్సిపల్ శాఖకు 65, హౌసింగ్ శాఖకు 31, ఇతర శాఖలకు సంబంధించి 71 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. భూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, గృహాలు, మౌలిక వసతులు, పింఛన్లు, ఇతర ప్రజా సమస్యలకు సంబంధించిన వినతులు అధికంగా వచ్చినట్లు వెల్లడించారు. ప్రతి వినతిని సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించి, అర్హత ఉన్న సమస్యలను వేగంగా పరిష్కరించాలని, అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా సమయానుకూలంగా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జి. సంధ్యారాణి, వై.వి. గణేష్, జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, డీఆర్‌డీఓ నాగ పద్మజ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాష్, డీఎస్‌డీఓ భాగ్యలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చారు.



# వరంగల్ సీపీగా ఎన్. శ్వేత

- రాష్ట్రవ్యాప్తంగా ఐపీఎస్ అధికారుల బదిలీలు
- సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ గా సన్ ప్రీత్ సింగ్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

రాష్ట్ర ప్రభుత్వం సోమవారం భారీ స్థాయిలో ఐపీఎస్ అధికారుల బదిలీలు చేపట్టింది. ఈ బదిలీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సన్ ప్రీత్ సింగ్‌ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో 2012 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి ఎన్. శ్వేతను వరంగల్ పోలీస్ కమిషనర్‌గా నియమించింది. ప్రస్తుతం ఎన్. శ్వేత హైదరాబాద్ నార్త్ రేంజ్ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, పరిపాలనా సామర్థ్యంతో ఆమెకు మంచి గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ బాధ్యతలను ఆమెకు అప్పగిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరంగల్, హనుమకొండ జిల్లాలతో పాటు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణ ప్రాంతాలు ఉండటంతో పోలీసింగ్‌కు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. మహిళల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, మాదకద్రవ్యాల నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్ వంటి అంశాలపై కొత్త కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించే అవకాశాలు ఉన్నాయని పోలీసు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇదిలా ఉండగా, వరంగల్ పోలీస్ కమిషనర్‌గా సన్ ప్రీత్ సింగ్ తన పదవీకాలంలో పలు వినూత్న కార్యక్రమాలు చేపట్టి ప్రజల ప్రశంసలు అందుకున్నారు. నేరాల నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలన, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజలకు చేరువయ్యే పోలీసింగ్, సాంకేతికత ఆధారిత దర్యాప్తు వంటి అంశాల్లో ఆయన ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పలు కీలక కేసులను ఛేదించడంతో పాటు ప్రజల్లో పోలీసులపై విశ్వాసాన్ని పెంపొందించే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చారు. సన్ ప్రీత్ సింగ్‌ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా నియమించడం ఆయన సేవలకు గుర్తింపుగా భావిస్తున్నారు. ఇక వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న ఎన్. శ్వేత నాయకత్వంలో పోలీసింగ్ మరింత సమర్థవంతంగా కొనసాగుతుందని అధికారులు, ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన తాజా బదిలీ ఉత్తర్వులతో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు కొత్త నాయకత్వం లభించగా, త్వరలోనే ఎన్. శ్వేత బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆమె బాధ్యతలు చేపట్టిన అనంతరం పోలీసు శాఖలో పలు పరిపాలనా మార్పులు, నేర నియంత్రణకు సంబంధించిన కార్యాచరణపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# గ్రేటర్ నూతన కమిషనర్‌గా టి. వెంకన్న

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) నూతన కమిషనర్‌గా నియమితులైన టి. వెంకన్న సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం జీడబ్ల్యూఎంసీ అధికారులు, వివిధ విభాగాల సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిషనర్‌కు ఆత్మీయ స్వాగతం పలికిన అధికారులు, ఉద్యోగులు ఆయన నాయకత్వంలో నగర అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ టి. వెంకన్న సంబంధిత అధికారులతో సంక్షిప్తంగా సమావేశమై నగరంలోని పారిశుధ్యం, తాగునీటి సరఫరా, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, పెండింగ్ అభివృద్ధి పనులపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీకి చెందిన పలువురు ఉన్నతాధికారులు, విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొని నూతన కమిషనర్ టి. వెంకన్నకు శుభాకాంక్షలు తెలియజేశారు.



## శేరిపురం క్రాస్ రోడ్డు - కొండలమ్మ ఆలయ రోడ్డును నిర్మించాలి

- కంకర రోడ్డుతో రెండేళ్లుగా నరకయాతన అనుభవిస్తున్న ప్రజలు
- గ్రామ సభ హామీలను నెరవేర్చాలి : సీపీఎం జిల్లా నేత కందునూరి శ్రీనివాస్

**గార్ల ,జూన్ 29 (ప్రభాత గమనం) :**

మండలంలోని శేరిపురం క్రాస్ రోడ్డు నుండి కొండలమ్మ దేవాలయం వరకు ఉన్న కంకర రోడ్డుకు వెంటనే తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామంలో యం. వెంకట్ అధ్యక్షతన సీపీఎం గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ స్థానిక సమస్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా రోడ్డుపై కంకర పోసి వదిలేయడం వల్ల స్థానిక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిగా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఈ రోడ్డు గుండా నిత్యం ఇల్లందు, మానుకోట (మహబూబాబాద్) ప్రాంతాలకు వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారని గుర్తు చేశారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో రైతులు తమ పొలాలకు ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ రోడ్డు సమస్యపై గతంలో సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళనలు చేపట్టామని, స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్యతో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడం శోచనీయమన్నారు.ఇటీవల జరిగిన గ్రామ సభలో స్మశాన వాటికకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని విద్యుత్ శాఖ అధికారులు హామీ ఇచ్చారని, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తక్షణమే అక్కడ లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.పంచాయతీ మొత్తానికి రెగ్యులర్ ఆశా వర్కర్ లేకపోవడం వల్ల గ్రామీణులు, రోగులు వైద్య సేవలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఖాళీని భర్తీ చేయాలన్నారు.వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలక ముందే అధికారులు ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం మండల నాయకులు వి.పి. వెంకటేశ్వర్లు, ఎం. నాగమణి, సిహెచ్. ఎల్లయ్య, సిహెచ్. మౌనిక, గ్రామ శాఖ కార్యదర్శి వి. కొండయ్య, పార్టీ సభ్యులు జి. సీతారాం, వి. వీరభద్రం, వి. పద్మ, బి. ఝాన్సీ, బి. నరేష్ పాల్గొన్నారు.




## గార్లలో ప్రారంభమైన సహకార వారోత్సవాలు

- ప్యాక్స్ జెండాను ఆవిష్కరించిన చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్
- రైతులకు ప్యాక్స్ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది: చైర్మన్ హామీ

**గార్ల, జూన్ 29 (ప్రభాత గమనం) :**

మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలో జాతీయ సహకార వారోత్సవాలు సోమవారం నాడు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (PACS) కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ప్యాక్స్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై, సహకార పతాకాన్ని ఆవిష్కరించారు.జెండా ఆవిష్కరణ అనంతరం చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. జూన్ 29 నుంచి జూలై 6వ తేదీ వరకు వారం రోజుల పాటు మండల వ్యాప్తంగా ఈ సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సహకార రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో రైతులకు మరింత చేరువవడమే ఈ ఉత్సవాల ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.గార్ల మండల పరిధిలోని రైతు శ్రేయస్సే ధ్యేయంగా ప్యాక్స్ పనిచేస్తోందని చైర్మన్ స్పష్టం చేశారు. "రైతాంగానికి అన్ని వేళలా అండగా ఉంటూ, నిరంతరం అందుబాటులో ఉండి సేవలు అందిస్తాం" అని ఆయన హామీ ఇచ్చారు. వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతులకు అవసరమైన సకాలంలో రుణాలు అందించడంతో పాటు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, టార్పాలిన్లను సంఘం ద్వారా పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కేవలం పెట్టుబడి సాయమే కాకుండా, రైతులు పండించిన వరి ధాన్యం, మొక్కజొన్న పంటలను కొనుగోలు కేంద్రాల ద్వారా విజయవంతంగా సేకరిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధరతో సాగుతున్న ఈ కొనుగోలు ప్రక్రియను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్లు శీలంశెట్టి ప్రవీణ్, ఆడెపు వెంకటేశ్వర్లు, యార్లగడ్డ వెంకటేశ్వర్లు, నాదెళ్ళ శ్రీనివాస్, గంగావాల సునీత, నాదెళ్ళ రామారావు, యలమకంటి కమలమ్మ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు ప్యాక్స్ సీఈఓ సింగు వెంకటేశ్వర్లు, సంఘ కార్యదర్శి వెంకటేష్, సిబ్బంది దారా భీముడు, హెచ్. రవి, ఎస్. చంద్రశేఖర్, ఎన్. రమేష్, జి. ప్రతాప్ మరియు మండల పరిధిలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నిరుపేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు
- రూ.73.20 లక్షల విలువైన 119 చెక్కుల పంపిణీ



**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఎంతో కీలకంగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు అన్నారు. హనుమకొండ రాంనగర్‌లోని తన నివాసంలో సోమవారం రూ.73,20,100 విలువైన మొత్తం 119 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అనారోగ్యంతో చికిత్స కోసం భారీ వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక అండగా నిలుస్తోందన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అర్హులైన వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎం సహాయ నిధికి అధిక నిధులు కేటాయిస్తూ, గతంతో పోలిస్తే మరింత ఎక్కువ మందికి ఆర్థిక సహాయం అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ పేద ప్రజల సంక్షేమ కార్యక్రమాలను ఎక్కడా ఆపకుండా కొనసాగిస్తోందన్నారు. ముఖ్యంగా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేదలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతోందని చెప్పారు. చెక్కుల పంపిణీ అనంతరం ప్రజల నుంచి వినతులు, విజ్ఞప్తులను కొండా మురళీధర్ రావు స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఓర్పుగా విన్న ఆయన, సంబంధిత శాఖల అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని కొండా మురళీధర్ రావు స్పష్టం చేశారు.

## 'సర్' ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**




భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన కార్యాచరణ ప్రకారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లకు సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, వివరాల నమోదు వంటి అన్ని ప్రక్రియలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అర్హుడైన ఓటరును జాబితాలో నమోదు చేయడంతో పాటు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధ్రువీకరించాలని సూచించారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తూ, రాజకీయ పార్టీలతో సమన్వయం కొనసాగిస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి హనుమకొండ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని వివరించారు. జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ వేగంగా కొనసాగుతోందని, పరకాల నియోజకవర్గంలో 69 శాతం, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 47 శాతం ఫారాల పంపిణీ పూర్తయిందని చెప్పారు. మరో రెండు రోజుల్లో రెండు నియోజకవర్గాల్లోనూ వంద శాతం ఫారాల పంపిణీ పూర్తి చేస్తామని తెలిపారు. ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేస్తామని, ఫారాల పంపిణీ అనంతరం రెండో విడత బూత్ స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అన్ని బీఎల్ఓలు ఫారం-6 డిక్లరేషన్‌తో ఇంటింటికీ వెళ్లి విధులు నిర్వహిస్తున్నారని, ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పేర్కొన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డి.ఎస్. వెంకన్న, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## డూప్లికేట్ ఓట్లపై ఈసీ దృష్టి పెట్టాలి

- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత
- హైదరాబాద్ లో ఓటు ఉంటే ఏపీలో తొలగించాలని డిమాండ్



**హైదరాబాద్, జూన్ 29(ప్రభాత గమనం):**

డూప్లికేట్ ఓట్ల అంశంపై టీఆర్ఎస్ నేత కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో అంతర్‌రాష్ట్ర వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆమె కోరారు. హైదరాబాద్‌లో ఓటు హక్కు ఉన్న వారికి ఆంధ్రప్రదేశ్‌లో ఉంటే అక్కడి ఓటును తొలగించాలని, లేకపోతే హైదరాబాద్‌లోని ఓటును రద్దు చేయాలని సూచించారు. తన నియోజకవర్గమైన బోధన్‌లో 7 వేల ఓట్లు తొలగిస్తే, సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో కేవలం 808 ఓట్లు మాత్రమే ఎలా తొలగించారని ప్రశ్నించారు.



## ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలి

- ఫిర్యాదుదరులకు తక్షణమే న్యాయం జరిగేలా చూడాలి
- మహబూబాబాద్ ఎస్పీ డా. శబరీష్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, తొర్రూరు డీఎస్పీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లకు సంబంధించిన కేసు డైరీలు, విచారణలో ఉన్న పెండింగ్ కేసులు, పోక్సో కేసులు, మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తు పురోగతి, సీసీటీఎన్ఎస్ లో కేసుల ఆన్‌లైన్ నమోదు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దర్యాప్తులో నాణ్యతను పెంచుతూ, పెండింగ్ కేసులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం సీఐలు, ఎస్ఐలతో సమావేశమై ప్రజలతో నిరంతరం మమేకమై స్థానిక సమాచారాన్ని సేకరించాలని, నేరాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతి పోలీసు అధికారి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. తదుపరి ఎస్పీ డా. శబరీష్ చింతలపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, యువత మరియు గ్రామస్థులతో మమేకమైయ్యారు ఈ సందర్భంగా వారికీ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.అవగాహన కల్పిస్తూ, గుర్తు తెలియని ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. గ్రామంలో గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. అదేవిధంగా రాత్రి వేళల్లో దొంగతనాల నివారణకు గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని, గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అత్యవసర సమాచారం, అనుమానాస్పద సంఘటనలు, భద్రతా హెచ్చరికలను వెంటనే పరస్పరం పంచుకునేందుకు గ్రామ స్థాయిలో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం అత్యంత ముఖ్యమని, పోలీసులు,ప్రజల సమన్వయంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఎస్పీ డా. శబరీష్ . పేర్కొన్నారు.




## విజయ సంకల్ప సమ్మేళనానికి తరలిన బీజేపీ శ్రేణులు

**కేసముద్రం, జూన్29(ప్రభాత గమనం):**

భారతీయ జనతా పార్టీ (బిజెపి) జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'పోలింగ్ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనానికి' కేసముద్రం మండలం నుండి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు.మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ నేతృత్వంలో మండల పరిధిలోని వివిధ పోలింగ్ బూత్ అధ్యక్షులు, సీనియర్ బిజెపి నాయకులు, కార్యకర్తలు ఒక సమూహంగా వరంగల్ మహాసభకు బయలుదేరి వెళ్లారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడానికి, బూత్ స్థాయిలో పార్టీ విజయానికి తీసుకోవాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేయడానికి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ వరంగల్ రావడం పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపిందన్నారు. "బూత్ గెలిస్తేనే.. ఎన్నికల్లో విజయం లభిస్తుంది" అనే నినాదంతో ప్రతి కార్యకర్త సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు.వరంగల్ వెళ్తున్న వారిలో మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన బిజెపి ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధం

- గార్ల మండల కాంగ్రెస్ పిలుపు
- ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్న నాయకులు

**గార్ల, జూన్ 29 (ప్రభాత గమనం) :**




ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అత్యంత కీలకమైన ఆయుధమని గార్ల మండల కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న 'సార్' (SIR) కార్యక్రమంలో భాగంగా, మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూక్య ఉమా మురళి నాయక్, స్థానిక పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్యల ఆదేశాల మేరకు గార్ల మండలంలో ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియను కాంగ్రెస్ శ్రేణులు వేగవంతం చేశాయి.మండల కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణా గౌడ్, మేజర్ పంచాయతీ సర్పంచ్ శ్రీమతి బానోత్ పార్వతి హత్రామ్ నాయక్ ల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక (బిఎల్ఓ) లు, పార్టీ తరఫున శిక్షణ పొందిన (బిఎల్ఏ) లతో కలిసి ఓటర్ల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామీణ స్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బిఎల్ఏలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు జాబితాలోని తప్పుల సవరణలను బాధ్యతగా చేపట్టాలన్నారు."రాబోయే రోజుల్లో ప్రతి పోలింగ్ బూత్ నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే మన లక్ష్యం. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, స్థానిక నాయకత్వ సమన్వయంతో ప్రజల, పార్టీ అభివృద్ధి ధ్యేయంగా ప్రతి కార్యకర్త ముందుకు సాగాలి."ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పళ్ళ నరసయ్య, మైనార్టీ నాయకుడు మహమ్మద్ మోహిన్, యూత్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు షేక్ యాకుబ్ పాషా, బానోత్ హత్తిరాం నాయక్, గంత సిరి వీరన్న, పిల్లమర్రి వీరస్వామి, రాముడు నాయక్, ఎం. దుర్గారావు, రామకృష్ణ, రాములు నాయక్, ముత్తయ్య ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.